క్లుప్తంగా

కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేట బ్రాహ్మణ అగ్రహారంలోని శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్టా మహోత్సవ పూజా కార్యక్రమాలను మూడో రోజు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం మూల మంత్రానుష్టాన హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం పాహిరామ ప్రభో సంగీత రూపకం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భద్రాచల రామదాసు కీర్తనలు మధుర గాన సుధానిధి పోపూరి గౌరీనాథ్ బృందం లయబద్ధంగా ఆలపించారు. పలువురు కళాకారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని భక్తబృందం కోరింది.

ఘనంగా గంగానమ్మ సంబరం



మర్రిపాలెం(నాగాయలంక): శ్రీగంగానమ్మతల్లి నెల సంబరం బుధవారం రాత్రి, గురువారం కోలాహలంగా సాగింది. గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్లపై రూపొందించిన ప్రత్యేక మందిరాలను డప్పు నృత్యాలు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ఊరేగింపుగా గంగానమ్మ గుడికి తరలివెళ్లారు. గ్రామంలోని హనుమాన్ చాలీసా భజనల ఆధ్యాత్మిక గురువు గుండాబత్తుని వెంకట ప్రసాద్, భువన్ ఆధ్వర్యాన నిర్మించిన అమ్మవారి మండపం భక్తులను అలరించింది. మందిరంతో పాటు బాపట్ల జిల్లా మూర్తోటకు చెందిన గౌరీశంకర్ స్వామి బృందం ఆలపించిన భక్తిగీతాలు, డప్పు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు నేతృత్వంలో శనివారం రాత్రి 25 మందిని సత్కరించారు. కార్యక్రమంలో పాలిశెట్టి మురహరి, గుడివాక శేషుబాబు, బండ్రెడ్డి శేషు, బండ్రెడ్డి బోసు, గుండాబత్తుని వెంకట సుబ్బారావు(ఫ్యాన్సీ), భోగాది చంద్రశేఖర్, గుండాబత్తుని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గురువారం గ్రామస్తులు గుడిలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పలువురు పెద్దలు, గ్రామ ప్రముఖులు అమ్మవారికి పూజలు జరిపారు.

పరామర్శ

ఘంటసాల: రాజరత్నం మరణం బాధాకరమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన ఎన్నారై మూల్పూరి రత్నశేఖర్ తల్లి రాజరత్నం ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్థానిక నేతలతో కలసి ఎన్నారై రత్న శేఖర్ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. రాజరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, నేతలు బండి పరాత్పరరావు, పరిసే చలపతి పాల్గొన్నారు.

బాలికలు వసతి గృహాలను వినియోగించుకోవాలి



శ్రీకాకుళం(ఘంటసాల): అన్ని వర్గాల బాలికలకు ఉచిత వసతి, విద్యా సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వసతి గృహాలను వినియోగించుకోవాలని శ్రీకాకుళం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వార్డెన్ పి.జ్ఞాన సుందరి అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని వేసవి సెలవుల అనంతరం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డెన్ జ్ఞాన సుందరి మాట్లాడుతూ శ్రీకాకుళం హాస్టల్లో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే బాలికలకు ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీలకు 70, హెచ్‌సీలకు 12, ఎస్టీలకు 5, బీసీలకు 9, ఓసీలకు 4 మొత్తం 100 మందికి అవకాశం ఉందన్నారు. హాస్టల్‌లో జాయిన్ అయ్యేవారు తెల్లరేషన్‌కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, హెచ్‌సీ తల్లిదండ్రుల పిల్లలు అర్హులన్నారు. హాస్టల్‌లో ఉన్న వారికి ఉచితంగా నోట్ పుస్తకాలు, నాణ్యమైన భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు కూడా అమ్మకు వందనం వర్తిస్తుందని వార్డెన్ చెప్పారు.

పంట కాలువలో పూడిక తీత

మండవల్లి: మండలంలోని లోకుమూడి పంట కాలువలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు ఎంపీడీఓ ఎస్ నవీన్ పేర్కొన్నారు. రూ.56 వేలతో 34 మంది కూలీలు గురువారం పనులు చేసినట్లు తెలిపారు. ఉపాధి పనుల ద్వారా కాలువల్లో నీటి పారుదల బాగా జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో ఆ నీటిని పంట పొలాలకు రైతులు వినియోగించుకోవడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

విద్యార్థుల బడిబాట

- పాఠశాలలు ప్రారంభం
- చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు



కోడూరులోని దింటిమెరకలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

మచిలీపట్నంటౌన్: వేసవి సెలవుల అనంతరం మచిలీపట్నం నియోజకవర్గంలోని పాఠశాలల్లో బడి గంటలు మోగాయి. నియోజకవర్గంలోని 150 ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. దాదాపు నెలా 15 రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులు పాఠశాలల బాటపట్టారు. విద్యార్థులు తరువాత తరగతిలో చేరారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు అందజేసేందుకు 98,674 పాఠ్యపుస్తకాలను, 77,180 నోట్ పుస్తకాలను, 8,710 బెల్టులు, 12,466 బ్యాగ్‌లను పాఠశాలలకు అప్పగించినట్లు ఎంఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. వీటిని నగరంలోని స్టాక్ పాయింట్ అయిన హైనీ హైస్కూల్ నుంచి నాలుగైదు రోజులుగా పాఠశాలలకు పంపుతున్నామన్నారు. విద్యార్థులకు ఇంకా షూస్, యూనిఫాంలు మినహా విద్యాకానుక కిట్లను అందజేస్తారన్నారు.

కోడూరు: వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు తిరిగి బడిబాట పట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవు ప్రకటించగా, 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో ఆ రోజు కూడా సెలవు ఇచ్చారు. దీంతో గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లను ముందుగా పాఠశాలలకు చేర్చారు. విద్యాశాఖ పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని ఈ కిట్లను చిన్నారులకు పంపిణీ చేశారు. మండలంలోని 47 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ పాఠశాలల్లో ఈ కిట్లను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించారు. తొలి విడతగా మండలానికి మంజూరైన 16,068 పాఠ్యపుస్తకాలు, 12,688 నోట్ పుస్తకాలతో పాటు 1,567 బెల్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన అడ్మిషన్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని, పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి క్యాంపెనింగ్ కూడా చేస్తున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు చెప్పారు. విద్యాకమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాలలకు తరలిస్తున్న నోట్ పుస్తకాలు



కోడూరులో విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

అడ్మిషన్ల పెంపునకు..

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి ఉపాధ్యాయులు ఇళ్లబాట పట్టారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవ్వగా తరగతులు ముగిసిన తర్వాత ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి క్యాంపెనింగ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. కోడూరు, స్వతంత్రపురం, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో ఉపాధ్యాయులు క్యాంపెనింగ్ నిర్వహించారు. వేసవి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి క్యాంపెనింగ్ చేయగా, అప్పట్లో అడ్మిషన్ పత్రాలు అందించిన విద్యార్థులకు గురువారం నుంచి పాఠశాలల్లో చేర్చారు.

నాగాయలంక: మండలంలోని 51 పాఠశాలల్లో ఎంఈఓ అన్నపురెడ్డి రామారావు పర్యవేక్షణలో శుక్రవారం 3,035 మంది బాల బాలికలకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బెల్ట్‌లు వచ్చాయని, మండల స్టాక్ పాయింట్ నుంచి 12న అన్ని పాఠశాలలకు సరఫరా చేశామని ఎంఈఓ చెప్పారు. భావదేవరపల్లి, ఎదురుమొండి జెడ్పీ ఉన్నత పాఠశాలలు సొర్లగొంది, నాలి, మర్రిపాలెం పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ప్రజా ప్రతినిధులకు అభినందనలు



ఎంపీ బాలశౌరిని కలిసి అభినందిస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

పెడన: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిని గురువారం బందరు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పెడన మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పలువురు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం సమర్పించి, శాలువాతో సత్కరించారు. ఎంపీని కలిసి అభినందించిన వారిలో చైర్‌పర్సన్ భర్త, మాజీ ఫ్లోర్ లీడర్, 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్, 6, 9, 21వ వార్డుల కౌన్సిలర్లు బాబులాల్, గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్‌బాబు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు హుమాయున్, కోమట్ల అనిల్ కుమార్, కొసనం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను పలువురు అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వగృహంలో గురువారం అవనిగడ్డ, మొవ్వ ఏడీఏలు జయప్రద, శ్యామల, ఏవోలు కలిసి పూలమాల వేసి శాలువా కప్పి అభినందించారు. ఏఎస్‌డబ్ల్యూవో సాల్మన్‌రాజుతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని వసతి గృహ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఏపీ నాటక అకాడమీ మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ల సాంబశివరావు, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని కలసి అభినందించారు.

ఘంటసాల: ఎమ్మెల్యేగా ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్ మొట్ట మొదటిసారిగా ఘంటసాల విచ్చేసిన సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా)ను రామకృష్ణ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు బండి పరాత్పరరావు, టీడీపీ మండల కార్యదర్శి పరిసే చలపతి, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీతో నిరుద్యోగుల కలను నిజం చేశారు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డలో పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: మెగా డీఎస్సీతో ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కల నెరవేరనుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలిసంతకం చేసిన నేపథ్యంలో గురువారం స్థానిక వంతెన సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన నేత మండలి వెంకట్రామ్(రాజా)తో పాటు డీఎస్సీ అభ్యర్థులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'అంగన్‌వాడీ'పై అవగాహన

కోడూరు: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గురువారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించి, అంగన్‌వాడీల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. మూడు సంవత్సరాల పైబడిన చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను వివరించారు.

కృత్తివెన్ను: అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నాయని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇంతేరు పంచాయతీ సత్రవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ పిల్లల శారీరక మానసిక ఎదుగుదల మూడు నుంచి ఆరేళ్ల వరకు గణనీయంగా ఉంటుందని ఈ వయస్సులో వారికి మనం నేర్పే ప్రతి విషయం వారి భవిష్యత్తుకు మంచి బాటగా మారుతుందన్నారు. ఐదేళ్లు దాటిన పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కొనసాగించాలని సూచించారు. ఐదేళ్లు దాటిన 9 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి, హెచ్‌ఎం సుందరరావు, స్థానికులు శ్రీనివాసరావు, ప్రకాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, కమలావతి, కుమారి, హెల్పర్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది

గూడూరు: మల్లవోలు సెక్టారులోని జమీరామరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను ప్రీ స్కూల్‌లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గోపీ అరుణ, ఏఎన్‌ఎం హేమలత, ఆశా కార్యకర్త నాగసింధు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జమీరామరాజుపాలెంలో ర్యాలీ

ముగిసిన ఆర్‌సీఎం చర్చి వందేళ్ల వేడుకలు



ప్రసంగిస్తున్న మచిలీపట్నం విచారణ గురువు జోజిబాబు

ఉల్లిపాలెం(కోడూరు): పెద ఉల్లిపాలెం ఏసు తిరు హృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) వందేళ్ల వేడుకలు ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకల ముగింపు సందర్భంగా మచిలీపట్నం ఫాదర్ జోజిబాబు మాట్లాడుతూ వందేళ్ల వేడుక చేసుకోవడం సామాన్య విషయం కాదన్నారు. మన పూర్వీకులు చూపిన ఆధ్యాత్మిక బాటలో నేటి తరం పయనించాలన్నారు. అవనిగడ్డ విచారణ గురువు జి.సురేష్ మెర్లో మాట్లాడుతూ క్రీస్తు ఆచరించిన మూడు సుగుణాలైన స్పందించే హృదయం, ప్రేమించడం, క్షమించడం వంటి వాటిని పాటిస్తే ప్రతి కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. విచారణ గురువుల ప్రత్యేక ప్రార్థన, పరలోక ప్రార్థన, పరలోక జపం చేశారు. విశ్వాసులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మెరకపాలెం విచారణ గురువు బాలశౌరి, మచిలీపట్నం విచారణ ఉప గురువు విజయ్, బంటుమిల్లి విచారణ గురువు మహేష్ పాల్గొనగా పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విశ్వాసులువచ్చారు. సంఘ పెద్దలు, మరియ దళ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చేపల వేట నిషేధానికి తెర



నాగాయలంక రేవులో నిలిచిన బోట్‌లు

నేటి నుంచి సముద్రంలోకి గంగపుత్రులు

నాగాయలంక: దివిసీమ పరిధిలోని సముద్ర జలాల్లో ఏప్రిల్14వ తేదీ అర్ధరాత్రి నుంచి మెకనైజ్డ్, మోటారు బోట్లలో మత్స్యకారుల చేపల వేటపై విధించిన 61 రోజుల నిషేధం శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. స్థానిక మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ, ఎఫ్‌డీఓ తమ్ములూరి సునీత 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ సమాచారాన్ని ధ్రువీకరించారు. ఏపీ మత్స్య క్రమబద్ధీకరణ చట్టం–1994 సెక్షన్–4 (9వచట్టం1995) సెక్షన్–2 ప్రకారం జూన్ 14వరకు (61రోజులు) నిషేధం అమల్లో ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలో చేపలు, రొయ్యల వేటలను పూర్తిగా నిలిపి వేస్తూ దివిసీమలో సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు నోటీసులు జారీచేసిన విషయం విదితమే. చేపలు, రొయ్యల సంతానోత్పత్తి సమయం కావడంతో తల్లిజాతిని సంరక్షించడం, చేపల జనాభా పెరుగుదలను ప్రోత్సహించడంతో సముద్రపు మత్స్యసంపద సుస్థిరత సాధించడానికి ప్రభుత్వం వేట నిషేధం అమలు చేసిందని వివరించారు. చేపల వేటకు వెళ్లకుండా మత్స్యసంపద అభివృద్ధికి సహకరించిన మత్స్యకారులకు కృతజ్ఞతలు చెప్పారు. దివిసీమలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, మండలాలలోని 11ల్యాండింగ్ సెంటర్లలో 1123 యాంత్రిక బోట్లు చేపల వేట నిషేధం కిందకు వచ్చాయని తెలిపారు.

నిషేధకాల జీవన భృతిని త్వరితగతిన అందించాలి: లకనం

సముద్ర తీరప్రాంతాల్లో చేపల వేట నిషేధ కాలం ముగిసినందున నిషిద్ధ కాలంలో ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా అందించే నిషేధకాల జీవన భృతిని తక్షణం అందించాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సేవాసమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వలలు, పడవలు బాగు చేసుకుని మళ్లీ వేటకు సిద్ధపడాల్సి ఉంటుందని రెండు నెలల కాలం ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులను సకాలంలో ఆదుకోవాల్సి ఉందన్నారు.



సముద్ర శింకు వద్దకు చేరిన వేట వలలు

దివిసీమలో..

కోడూరు: దివిసీమలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో సుమారు 30వేల మత్స్యకారులు ఉన్నాయి. అయితే వీరిలో 15 వేల మంది ప్రత్యేక్షంగా చేపల వేట ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. మూడు మండలాల్లో 1,162 లెసెన్స్ కలిగిన వేట బోట్లు ఉండగా, వీటితో పాటు మరో 500లకు పైగా సంప్రదాయ పడవలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నిషేధ కాలంలో మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు చేర్చి ఉపాధి లేక ఇళ్లకే పరిమితమయ్యారు. గత ఐదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు రూ.10వేలు భరోసా నగదును ఇచ్చారు. ఈ ఏడాది ఎన్నికల కారణంగా మత్స్యకారులకు ఏవిధమైన పరిహారం అందలేదు. అయితే ఆ శాఖ అధికారులు మాత్రం ఈ ఏడాది కూడా బోట్ల ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వలల, డీజిల్, తాగునీటి వంటివి సమకూర్చుకుంటున్నారు. మత్స్యకారులు వేట సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై మత్స్యశాఖ అధికారులు అవగాహన కల్పించారు.

కాశీ విశ్వేశ్వరుడి ఆలయంలో మహా కుంభాభిషేకం





పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆలయ శిఖరానికి 9.18 గంటలకు మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, శ్రీ స్వామివారి శాంతి కల్యాణం, అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వేదపండితులు అగ్నిహోత్రి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో కుంభాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





• రంగుల పందిరి

నాగాయలంక-అవనిగడ్డ ప్రధానమార్గం.. రోడ్డుకు రెండు వైపులా పచ్చనిచెట్లు, అగ్నిపూల సౌందర్యంతో కలిసి రంగుల పందిరి మాదిరి కనిపిస్తోంది. అగ్నిపూల ఆకులే కనిపించకుండా గుత్తులు గుత్తులుగా పూలన్నీ విచ్చుకుంటాయి. ఈ దారి వెంట ఈ పూలు తేలికపాటి సువాసనలు వెజల్లడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లో జరిగే వసంత పంచమి, హోలీ వేడుకల్లో వీటికి పెద్దపీట వేస్తారు. అవనిగడ్డ మెయిన్‌రోడ్డులో నాగాయలంక ముఖ ద్వారం నుంచి బందలాయిచెరువు వరకు రెండు వైపులా పచ్చని చెట్లు అగ్నిపూల సోయగాన్ని శుక్రవారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–నాగాయలంక

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు



మోపిదేవి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన పూర్ణచంద్రరావు

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం చల్లపల్లి మండలం రామానగరానికి చెందిన రావి వెంకట పూర్ణచంద్రరావు మోపిదేవి నుంచి రామానగరానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. స్థానిక శ్రీ భాషితా టాలెంట్ స్కూల్ సమీపంలో జాతీయ రహదారి క్రాస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీను తప్పించబోయాడు. లారీ వెనుక భాగంలో ఢీ కొనడంతో రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో వృద్ధుని తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో మోపిదేవి 108 వాహనం వెంటనే ఘటనా స్థలంకు చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అదే వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పైలెట్ శ్రీ చంద్, ఈఎంటీ వెంకట నరసయ్య తెలిపారు. దీనిపై ఎస్‌ఐ సత్యనారాయణను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని, పూర్తి సమాచారం అందలేదని తెలిపారు.